క్లుప్తంగా

అప్రెంటీస్ మేళా రేపు

సీతంపేట: ఐటీఐ పాసైన విద్యార్థుల కోసం ఈనెల 10న అప్రెంటీ రిక్రూట్‌మెంట్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ మూటక గోపాలకృష్ణ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణాలోని మేదా సెర్వో ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ఫిట్టర్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, ఎలక్ట్రానిక్, మెకానికల్ విభాగాల్లో అప్రెంటిషిప్ కోసం ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఎంపికైన వారికి నెలకు రూ.13,500ల స్టైయిఫండ్ ఇవ్వనున్నట్లు తెలిపారు. సంబంధిత ట్రేడ్ సబ్జెక్టుపై రాతపరీక్ష ద్వారా ఎంపిక చేయనున్నట్లు వెల్లడించారు. వివరాలకు 9390063881, 9493817472కు ఫోన్ చేయాలన్నారు.

20 లీటర్ల సారా పట్టివేత

వీరఘట్టం: మండలంలోని కుంబిడి ఇచ్ఛాపురం సమీపంలో ఎస్సై ఎస్‌వీ రమణ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. కామేశ్వరరావు అనే వ్యక్తి సారా తరలిస్తుండగా అతన్ని అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 20 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

స్టోన్ ప్లాంటేషన్ పనుల పరిశీలన



స్టోన్ ప్లాంటేషన్‌పై ఆరాతీస్తున్న సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్

వీరఘట్టం: భూ సర్వే పూర్తయిన గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్‌ను వేగవంతంగా పూర్తి చేయాలని సబ్ కలెక్టర్ నూరల్‌కమర్ ఆదేశించారు. మండలంలోని పాలమెట్ట గ్రామంలో చేపడుతున్న స్టోన్ ప్లాంటేషన్‌ను మంగళవారం ఆయన పరిశీలించారు. రైతులు, గ్రామస్తుల సహకారంతో సర్వే పూర్తిచేయాలని, పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

జీఓ-3కి చట్టబద్ధత కల్పించాలి



మాట్లాడుతున్న గిరిజన సంఘం నాయకులు

సీతంపేట: జీఓ నంబర్ 3కి చట్టబద్ధత కల్పించాలని గిరిజన సంఘం నాయకులు బి.అప్పారావు డిమాండ్ చేశారు. స్థానిక సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బోయ, వాల్మీకి కులాలను ఎస్టీ జాబితాలో చేర్చొద్దని, నాన్‌షెడ్యూల్డ్ పరిధిలోని గ్రామాలను షెడ్యూల్డ్ ఏరియాలో చేర్చాలని కోరారు. మణిపూర్‌లో మారణహోమాన్ని ఆపాలని, అటవీ హక్కుల చట్టం పకడ్బందీగా అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.భాస్కరరావు, ఎం.లక్ష్మణరావు, సవర గంగయ్య, శ్రీను, గంగాధర్, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.


త్రైతసిద్ధాంత భగవద్గీత ప్రచారం



త్రైతసిద్ధాంత భగవద్గీతను ప్రచారం చేస్తున్న సంతోష్, తదితరులు

పాలకొండ రూరల్: సర్వజనుల హితము కోరిన శ్రీకృష్ణ భగవానుడు భగవద్గీతను మనకు అందించారని త్రైతసిద్ధాంతం ప్రబోధ సేవాసమితి హిందూ జ్ఞానవేదిక శ్రీకాకుళం కమిటీ అధ్యక్షుడు సంతోష్ కుమార్ అన్నారు. త్రైతసిద్ధాంత భగవద్గీతపై పట్టణంలో మంగళవారం ఇంటింట ప్రచారం చేపట్టారు. ఈ సందర్భంగా మోక్ష సన్యాస యోగంపై ప్రజలకు అవగాహన కల్పించారు. దేవుడు చూపిన మార్గంను అనుసరించాలని, తోటివారికి తోచిన సాయం చేయాలని సూచించారు. సేవా సమితి సభ్యులు దుర్గారావు, పుండరీకాక్ష, ఈశ్వర్‌లాల్, స్వాతి, సంతోష్, లక్ష్మీ తదితరులున్నారు.

ఉద్యోగుల సమస్యలపై నిరంతర పోరాటం



సభ్యత్వ నమోదు చేస్తున్న ఎన్‌జీఓ నాయకులు

పాలకొండ: ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడంలో ఏపీఎన్‌జీఓ సంఘం నిరంతరం పోరాటం చేస్తుందని పాలకొండ తాలూకా యూనిట్ ఏపీ ఎన్‌జీఓ సంఘం నాయకులు లిల్లీపుష్పనాథం అన్నారు. సంఘ సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌జీఓ సంఘం చేపడుతున్న కార్యక్రమాలను ఆయన వివరించారు. అనంతరం సభ్యత్వ నమోదును ప్రారంభించారు. సమావేశంలో యూనియన్ నాయకులు రంగాచారి, ఈశ్వరరావు, గంటానాయుడు తదితరులు పాల్గొన్నారు.

కాలిబాటలతో బహుళ ప్రయోజనాలు

గరుగుబిల్లి: వరిపంటలో కుదుళ్లను దగ్గరగా నాటడం వల్ల పంటకు తెగుళ్ల సోకే అవకాశం ఎక్కువగా ఉంది. దీని నివారణకు నాటిన సమయంలోనే కాలిబాటలను వేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. కాలిబాటలను వేసుకోవడం వల్ల పంటకు గాలి, సూర్యరశ్మి సక్రమంగా అందడంతో పంట ఏపుగా వచ్చే అవకాశం ఉంది. అలాగే పంటకు తెగుళ్ల సోకకుండా కాపాడుకోవచ్చని మండల వ్యవసాయాధికారి ఆర్.విజయభారతి అన్నారు. వరి నాట్లు వేసే విధానం, కాలిబాటల వల్ల కలిగే ఉపయోగాలను వివరించారు.

గొచ్చులుగా నాటొద్దు

వరికుదుళ్లను గొచ్చులుగా నాటడం వల్ల పంటకు గాలి, వెలుతురు సక్రమంగా అందక పైరు పెరుగుదల మందగించడంతో పాటు చీడపీడలు తొందరగా ఆశిస్తాయి. సాధారణంగా ఎక్కువగా వరి మొనలను నాటితే ఎక్కువ దిగుబడి వస్తుందని రైతులు భావిస్తుంటారు. కానీ ఇది సరైన పద్ధతికాదు. వరి మొనలలో సాంద్రతే కీలకం. దగ్గరగా నాటడం వల్ల మొక్కలకు అంతర వాతావరణం అనుకూలించక తెగుళ్లసోకే అవకాశంవుంది. ముఖ్యంగా గొచ్చులుగా నాటిన పంటపొలాల్లో సుడిదోమ ఆశించే అవకాశంవుంది.



ఉల్లిభద్ర సమీపంలో కాలిబాటలు వేసిన వరిపొలం

కాలిబాటలతో ఉపయోగాలు

- వరిలో తెగుళ్లను సమర్థవంతగా తట్టుకొనేందుకు ప్రతీ రెండు మీటర్లకు 20 సెం.మీల దూరంలో కాలిబాటలను వేసుకోవాలి.
- కాలిబాటలతో మొక్కల సామర్థ్యం పెరుగుతుంది.
- పంటకు గాలి, సూర్యరశ్మి, వెలుతురు పుష్కలంగా లభిస్తుంది.
- పంటలో సూక్ష్మపోషకాలు కూడా పూర్తిస్థాయిలో లభిస్తాయి.
- సుడిదోమ, అగ్గితెగుళ్ల వ్యాప్తిని అదుపు చేయవచ్చు.
- ఎరువులను కాలిబాటల ద్వారా చల్లితే పొలమంతా సమానంగా వేసేందుకు అవకాశం ఉంటుంది. సేంద్రియ ఎరువు మొక్కలకు పూర్తిస్థాయిలో అందుతుంది.
- కిరణజన్య సంయోగక్రియ అధికంగా జరిగి మొక్కలలో పత్రహరితం అధికంగా ఉత్పత్తి కావడంతో పంట దిగుబడులు పెరిగేందుకు అవకాశం ఉంటుంది.
- వరిలో కలుపును సులభంగా నియంత్రించేందుకు వీలుంటుంది.
- ఎలుకలను సమర్థవంతంగా అదుపుచేయవచ్చు.
- కోత సమయంలో పంట నేలవాలితే నిలబెట్టడానికి అనుకూలంగా ఉంటుంది.

నేటి నుంచి 'మేరీ మాటి–మేరా దేశ్'

భామిని: దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ నెల 9 నుంచి 25 వరకు జాతీయ స్థాయిలో 'మేరీ మాటీ–మేరా దేశ్' కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా 9న నాభూమి–నాదేశం శిలాఫలకం ఆవిష్కరణ, 10న నంద ప్రాణ ప్రవతిష్ట, 11న వసుధకు వందనం పేరుతో 75 పచ్చని మొక్కలు నాటడం, 14న వీరులకు వందనం చేపట్టనున్నట్లు ఎంపీడీఓ జి.చంద్రరావు, ఉపాధి ఏపీఓ ఇ.తులసీదాస్ తెలిపారు. ప్రతీ సచివాలయం ముందు ఇందుకు సంబంధించిన శిలాఫలకాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.



నాభూమి-నాదేశం శిలాఫలకం నమూనా

వార్డు మెంబర్ల ఎన్నికకు నోటిఫికేషన్ విడుదల

గరుగుబిల్లి: గ్రామ పంచాయతీ వార్డు మెంబర్ల ఎన్నికకు సంబంధించి గెజిట్ నోటిఫికేషన్‌ను ఈఓపీఆర్డీ ఎల్.గోపాలరావు పెదగుడబలో మంగళవారం విడుదల చేశారు. మండలంలోని పెదగుడబ, గొట్టివలస పంచాయతీలో వార్డు మెంబర్ల ఎన్నికకు అధికారులు నోటిఫికేషన్‌ను విడుదల చేసినట్లు చెప్పారు. ఈనెల 10 వరకు నామినేషన్ల స్వీకరణ, 11న నామినేషన్ల పరిశీలన, 12న అభ్యంతరాల స్వీకరణ, 14న తుది జాబితా ప్రకటించనున్నారు. ఈనెల 19న ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు చెప్పారు. ఎన్నికలను ప్రశాంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు.

నామినేషన్ల స్వీకరణ ప్రారంభం

పాలకొండ రూరల్: మండలంలో పనుకువలస పంచాయతీ సర్పంచ్(జనరల్), అన్నవరం పంచాయతీ పరిధిలో 6వ వార్డు (ఎస్సీ జనరల్), వీపీ రాజుపేట పంచాయతీ పరిధిలో 1వ వార్డు(బీసీ జనరల్), 7వ వార్డు (ఎస్సీ జనరల్) మెంబర్ల ఉప ఎన్నికకు మంగళవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. తొలిరోజు ఎవరూ నామినేషన్ దాఖలు చేయలేదని స్టేజ్–1 రిటర్నింగ్ అధికారులు ప్రవళ్లిక, త్రినాథులు, సోంబాబు తెలిపారు.

ఓటరు జాబితా సక్రమంగా రూపొందించాలి

పాలకొండ: ఓటరు జాబితాలు సక్రమంగా తయారు చేయాలని తహసీల్దార్ పి.సోమేశ్వరరావు తెలిపారు. మండలంలోని బీఎల్‌ఓలతో మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ నెల 21లోగా ఇంటింట ఓటరు సర్వే పూర్తిచేయాలని ఆదేశించారు. మార్పులు, చేర్పుల కోసం వచ్చిన దరఖాస్తులను భద్రంగా ఉంచాలని సూచించారు. 18 ఏళ్లు నిండిన యువతను ఓటర్లుగా నమోదు చేయాలన్నారు. రాజకీయ పార్టీల ప్రతినిధుల సహాయంతో ఎటువంటి వివాదాలు లేకుండా సక్రమంగా జాబితా సిద్ధం చేయాలన్నారు.

- **భామిని:** మండలంలోని బాలేరు పంచాయతీ పరిధిలో చేపడుతున్న ఇంటింటి ఓటరు సర్వేను ఈఓపీఆర్డీ జి.కృష్ణారావు మంగళవారం పరిశీలించారు.



ఓటరు సర్వేను పరిశీలిస్తున్న ఈఓపీఆర్డీ కృష్ణారావు

బీఎల్‌ఓలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలు పరిశీలించడంతో పాటు తప్పులు ఉండే సవరించాలని సూచించారు. అర్హులను ఓటర్లుగా నమోదు చేయాలన్నారు.

గుమ్మలో 'ఫ్యామిలీ డాక్టర్'

కురుపాం: మండలంలోని గుమ్మ గ్రామంలో మంగళవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. మొండెంఖల్ పీహెచ్‌సీ వైద్యాధికారి బి.ప్రజ్ఞ గ్రామంలో 92 మందికి వైద్యసేవలు అందించారు. బాలింతలకు, గర్భిణులకు సాధారణ వైద్య తనిఖీలు చేసి తీసుకోవాల్సిన ఆరోగ్య జాగ్రత్తలను వివరించారు. సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, మలేరియా, డెంగీ, డయేరియా బారిన పడకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని, దోమలు కుట్టకుండా దోమతెరలు వినియోగించాలని సూచించారు. హెల్త్ సూపర్‌వైజర్ భారతి, భగవతి, ఆనంద్ పాల్గొన్నారు.



వైద్యతనిఖీలు చేస్తున్న డాక్టర్ బి.ప్రజ్ఞ

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని ఎల్విన్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలో రోడ్డు ప్రమాదాల నివారణపై పోలీసులు ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారు. అందులో భాగంగా రహదారి మలుపుల వద్ద ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయడం, రోడ్డుకు ఇరువైపులా ఉన్న ముళ్లపొదలు తొలగించడం వంటివి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఎస్సై షణ్ముఖరావు మాట్లాడుతూ వాహనచోదకులు స్పష్టంగా రహదారి మలుపులు కనిపించేలా జంగిల్ క్లియరెన్స్ చేస్తున్నామని, ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వాహనదారులు రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని కోరారు.



బత్తిలి ప్రధాన రోడ్డులో జంగిల్ క్లియరెన్స్ పనులు చేయిస్తున్న ఎస్సై

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

గరుగుబిల్లి:

స్త్రీనిధి రుణాలతో మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం పి.అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలోని వైకేపీ కార్యాలయంలో వీఓఏలు, గ్రామైఖ్య సంఘాల అధ్యక్షులతో ఆర్థిక అక్షరాస్యతపై రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం మంగళవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఏపీఎం మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతో స్త్రీనిధి రుణాలను మంజూరు చేస్తున్నట్లు చెప్పారు. ఇంతవరకు మహిళా సంఘాల సభ్యులకు రూ.3 కోట్లు రుణాలు మంజూరు చేయడం జరిగిందన్నారు. సమావేశంలో సీసీలు తిరుపతిరావు, కె.కృష్ణ, సీహెచ్ ప్రసాద్, మండల మహిళా సమైఖ్య అధ్యక్షురాలు జి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపీఎం అప్పలనాయుడు

విత్తన కిట్ల పంపిణీ



కురుపాం: మహిళా రైతులకు విత్తన కిట్లు పంపిణీ చేస్తున్న ఎంపీపీ శెట్టి పద్మావతి

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని దుడ్డుఖల్లు పంచాయతీ పరిధిలోని దుడ్డుఖల్లు, దాదుపురం గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ విధానంలో పంటలు సాగుచేస్తున్న 42 మంది ఎస్సీ రైతులకు ప్రధాన మంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన(పీఎంఏజేఏవై) ద్వారా మంజూరైన విత్తన కిట్లను ఎంపీపీ కుంబురుక దీనమయ్య మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షెడ్యూల్డ్ కులాలకు చెందిన రైతులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం విత్తన కిట్లను సమకూర్చడం సంతోషదాయకమన్నారు. వీటిని రైతులు సద్వినియోగం చేసుకోవాలని, పంటలు సాగుచేసి ఆదాయం సమకూర్చుకోవాలని సూచించారు. ఏపీ సీఏపీఎఫ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రజక కార్పొరేషన్ డైరెక్టర్ గోరిశెట్టి గిరిబాబు, వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ మండల కన్వీనర్ తోయక గోపాల్, ఎస్‌ఎఫ్‌ఎఫ్ అన్నపూర్ణ, ఎంటీ జి.నిర్మలాదేవి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.



దుడ్డుఖల్లులో రైతులకు విత్తన కిట్లు అందజేస్తున్న ఎంపీపీ దీనమయ్య

కురుపాం ఆర్బీకేలో..

కురుపాం: ప్రకృతి వ్యవసాయం చేస్తున్న మహిళా రైతులు విత్తనాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శెట్టి పద్మావతి అన్నారు. కురుపాం ఆర్బీకేలో ప్రకృతి వ్యవసాయ సమన్వయకర్త అన్నపూర్ణ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ప్రధానమంత్రి అనుసూచిత జాతి అభ్యుదయ యోజన(పీఎం ఏజేఏవై) కింద ఎస్సీ కార్పొరేషన్ ద్వారా 39 మంది మహిళా రైతులకు విత్తన కిట్లు పంపిణీ చేశారు. అనంతరం ప్రకృతి వ్యవసాయ సమన్వయకర్త అన్నపూర్ణ మాట్లాడుతూ.. మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో చిరుధాన్యాలు, కూరగాయల విత్తనాలను, వ్యవసాయ పరికరాలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సీఆర్పీ తిరుపతిరావు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల వినతి

పాలకొండ రూరల్: అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవల వివరాలు నమోదు చేస్తున్న యాప్ వినియోగంలో ఎదురవుతున్న సాంకేతిక సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీలు కోరారు. ఈ మేరకు మండలంలోని నవగాం సచివాయల సిబ్బందికి మంగళవారం వినతిపత్రం అందించారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ సభ్యులు, అంగన్‌వాడీ కార్యకర్తలు ఎస్.హిమప్రభ, టి.దివ్య, ఇందిర, ఇందు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై ఎంపీపీ ఆగ్రహం

జియ్యమ్మవలస: మండలంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ బొంగు సురేష్ అధ్యక్షతన మంగళవారం సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ శాఖల పనితీరు, మండలంలో చేపట్టిన అభివృద్ధి పనుల పురోగతిపై చర్చించారు. వట్టిగెడ్డ నుంచి సాగునీరు విడుదల చేసినప్పుడు తనను ఎందుకు పిలవలేదని ఇరిగేషన్ ఏఈ రఘుపై ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆరోజు తాను సెలవులో ఉన్నానని, డీఈ హాజరయ్యారని ఏఈ వివరణ ఇచ్చారు. అలాగే మండలంలో సచివాలయ భవనాలకు పూర్తిస్థాయిలో బిల్లులు చెల్లించినప్పటికీ నిర్మాణాలు ఎందుకు ఆలస్యమవుతున్నాయని మండల ఇంజినీర్ పార్థసారథిని ఎంపీపీ ప్రశ్నించారు. త్వరితగతిన నిర్మాణాలు చేపట్టాలని సంబంధిత కాంట్రాక్టర్లకు సూచించామని ఆయన సమాధానమిచ్చారు. సమావేశంలో వైస్ ఎంపీపీ జి.సంపత్‌కుమార్, నరేష్, జెడ్పీటీసీ శశికళ, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సత్కారం

భామిని: మండలంలోని కాట్రగడ–బి ఎంపీయూపీ స్కూల్‌లో ట్రిపుల్ ఐటీకి ఎంపికైన ఇద్దరు విద్యార్థులను మంగళవారం సత్కరించారు. పాఠశాల నుంచి బి.లావణ్య, జి.సంధ్య ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యారు. వారిని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు తోట సింహాచలం, హెచ్‌ఎం దివాకర్, ఉపాధ్యాయులు, గ్రామస్తులు సన్మానించారు. ఉన్నత చదువులు అభ్యసించి జీవితంలో ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు.

సాగు యంత్రాల వినియోగంపై అవగాహన



మహిళా రైతులకు అవగాహన కల్పిస్తున్న డాక్టర్ బి.సునీత

పాలకొండ రూరల్: వ్యవసాయ పనుల్లో శ్రమించే మహిళలు పనిలో ఒత్తిడి, శారీరక శ్రమను అధిగమించేందుకు మెలకువలు, యంత్రపరికరాలను వినియోగించాలని సర్పంచ్ తౌరల్పాటి నీరజ అన్నారు. మండలంలోని నవగాం గ్రామంలో ఆమదాలవలస కృషి విజ్ఞాన కేంద్రానికి చెందిన గృహ విజ్ఞాన శాస్త్రవేత్త డాక్టర్ బి.సునీత నేతృత్వంలో మంగళవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా స్థానిక వెలుగు ఫార్మా ప్రొడ్యూషర్ కార్యాలయంలో షెడ్యూల్ కుల ఉపప్రణాళికలో భాగంగా కలుపుతీత యంత్రాల వినియోగం, ఎరువులు, క్రిమిసంహారక మందుల పిచికారీ, వాడక సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మహిళా రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఫార్మా సంస్థ సీఈఓ వి.శ్రీకాంత్ పాల్గొన్నారు.

ట్రాఫిక్‌కు అంతరాయం

భామిని: మండలంలోని సింగిడి–బిల్లుమడ మధ్య ఏబీ రోడ్డుపై మంగళవారం భారీ లారీ నిలిచిపోవడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. రోడ్డుపై ఉన్న గుంతల కారణంగా ఈ మార్గంలో నిత్యం వాహనాలు మోరాయిస్తున్నాయని, ట్రాఫిక్‌కు ఇబ్బందులు తలెత్తుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాగా గత ఏడాది లివిరి నుంచి బిల్లుమడ వరకు రూ.6.32 కోట్లతో సుమారు 7 కిలోమీటర్ల మేర రోడ్డు నిర్మించారు. పనుల్లో నాణ్యత లోపించడంతో రహదారిపై గోతులు ఏర్పడ్డాయి. నాశిరకంగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్‌పై చర్యలు తీసుకోవాలని పలువురు ప్రయాణికులు కోరుతున్నారు.



రోడ్డుపై నిలిచిపోయిన లారీ

ఆకట్టుకున్న వర్ణచిత్రం

గరుగుబిల్లి:

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మండలంలోని నాగూరుకు చెందిన చిత్రకారుడు పల్ల పరిశినాయుడు వేసిన చిత్రం ఆకట్టుకుంది. గిరిజన మహిళ తన బిడ్డను ఎత్తుకుని, కట్టెలు మోసుకుంటూ వెళ్తున్నట్లు ఉన్న ఈ చిత్రం ఏజెన్సీ ప్రాంత మహిళల జీవనశైలిని ప్రతిభింభిస్తోంది.



ఉత్సాహంగా ఫ్రెషర్స్ డే

సీతంపేట: స్థానిక గిరిజన బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. మొదటి సంవత్సరం ఇంటర్మీడియట్ విద్యార్థులకు ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఆహ్వానం పలుకుతూ ఈ వేడుక నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలతో సందడి చేశారు. ప్రిన్సిపాల్ పి.సూర్యకుమారి మాట్లాడుతూ.. విద్యార్థులు చక్కగా చదువుకుని మంచి మార్కులతో ఉత్తీత సాధించాలని ఆకాంక్షించారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఉమాదేవి, డిప్యూటీ వార్డెన్ రామానందం, అధ్యాపకులు సత్యవతి, నాగమణి, సుజాత, పద్మావతి, అర్జున్‌రావు తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న బాలికలు

జిల్లా ఖజానా అధికారికి సన్మానం

కురుపాం: స్థానిక ఉపఖజానా కార్యాలయాన్ని జిల్లా ఖజానా అధికారి ఆర్.ఎస్.ఎ కుమార్ మంగళవారం సందర్శించారు. కార్యాలయ రికార్డులు, ఉద్యోగుల, విశ్రాంత ఉద్యోగుల ఈకేవైసీ ఆన్‌లైన్ నమోదును పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఉద్యోగులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మొదటిసారిగా ఉపఖజానా కార్యాలయాన్ని సందర్శించిన జిల్లా ఖజానా అధికారిని యూటీఎఫ్ నాయకులు, కార్యాలయ సిబ్బంది సన్మానించారు.



జిల్లా ఖజానా అధికారి కుమార్‌ను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది

గురుకులంలో ఆజాదీకా అమృత్ మహోత్సవ్

కొమరాడ: మండల కేంద్రంలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాలలో విజయవాడకు చెందిన స్వతంత్ర భారతి సంస్థ ప్రతినిధి రమేష్ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతదేశానికి ఆంగ్లేయులు వ్యాపారం చేసుకునేందుకు వలస వచ్చి విభజించి పాలించు సిద్ధాంతంతో దేశాన్ని ఆక్రమించుకున్నారన్నారు. వారి నుంచి దేశానికి స్వాతంత్ర్యం సాధనకు మంగళ పాండే, ఝాన్సీరాణి, బాలగంగాధర తిలక్, లాలా లజపతిరాయ్, భగత్‌సింగ్, రాజగురు సుఖ్‌దేవ్, చంద్రశేఖర్ ఆజాద్, వీర సావర్కర్, నేతాజీ సుభాష్ చంద్రబోష్ తదితర నాయకులు చేసిన పోరాటాలను విద్యార్థులకు వివరించారు. వారి పోరాటాన్ని, త్యాగాల నుంచి విద్యార్థులు స్ఫూర్తి పొందాలని, దేశభక్తిని పెంపొందించుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులు చేసిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



ఆకట్టుకున్న విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన